రుస్తుంబాదలో ఆటల పోటీలు

ప్రజాశక్తి - నరసాపురం

పట్టణంలోని రుస్తుంబాద కబడ్డీ స్టేడియంలో శ్రీ గోగులమ్మ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో జాతీయస్థాయి మహిళలు, పురుషుల పోటీలు గురువారం మూడో రోజు హోరాహోరీగా సాగాయి. లీగ్ కం నాకౌట్ పద్ధతిలో జరుగుతున్న ఈ పోటీలకు పురుషుల విభాగంలో 19, మహిళల్లో 11 రాష్ట్రాలకు చెందిన జట్లు తలపడుతున్నాయి. ఈ పోటీల్లో శుక్రవారం సెమీఫైనల్స్, శనివారం ఫైనల్స్ జరగనున్నాయి. కోడి పందేలు ముగియడంతో పోటీలను తిలకించేందుకు క్రీడాభిమానులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో కబడ్డీ స్టేడియం ప్రేక్షకులతో నిండిపోయింది. పోటీలను కాపు కార్పొరేషన్ ఛైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు, కన్వీనర్ కొత్తపల్లి జానకిరామ్, రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ సిఇఒ వీర్ల వెంకయ్య తదితరులు వీక్షించారు.

క్రీడలు, కళలు మన సంస్కృతి.. కోడి పందేలు కాదు

డివైఎఫ్ఐ క్రీడోత్సవాల ముగింపులో ఎంఎల్‌సి బి.గోపీమూర్తి

ప్రజాశక్తి - ఆకివీడు

కోడిపందేలు మన సంస్కృతి కాదని, క్రీడలు కళలు మన సంస్కృతి అని, వాటిని అభివృద్ధి చేసుకోవడానికి ప్రతిఒక్కరూ ముందుకు రావాలని ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి బొర్రా గోపీమూర్తి పిలుపునిచ్చారు. డివైఎఫ్ఐ రాష్ట్రస్థాయి క్రీడోత్సవాల ముగింపు సభ గురువారం రాత్రి క్రీడా ప్రాంగణంలో జరిగింది. డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గేదెల ధనుష్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో ఎంఎల్‌సితోపాటు ఎఎస్‌పి భీమారావు పాల్గొన్నారు. ఎఎస్‌పి భీమారావు మాట్లాడుతూ 42 సంవత్సరాల ఏకాధాటిగా ఒక యువజన సంఘం, ప్రజాసంఘాలు పోటీలు నిర్వహించడం అసాధారణమని, అభినందనీయమని అన్నారు. క్రీడల వల్ల వ్యక్తిత్వ, మానసిక వికాసంతోపాటు స్నేహభావం పెంపొందుతుందన్నారు. డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న మాట్లాడుతూ రాష్ట్రంలో త్వరలో తమ సంఘం ఆధ్వర్యంలో 'ఆటలు ముద్దు-డ్రగ్స్ వద్దు' అనే నినాదంతో ప్రత్యేక కార్యక్రమం చేపట్టనున్నామన్నారు. ఆటలు కనుమరుగైపోతున్న ప్రస్తుత తరుణంలో గ్రామీణ క్రీడలను బతికించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని, అందుకు ప్రతిఒక్కరూ తమతో కలిసి రావాలని కోరారు. చెప్పారు. డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు వై.రాము మాట్లాడుతూ చట్టం తన పని తాను చేసుకుపోతుందని నాయకులు చెబుతుంటారని, గోదావరి జిల్లాల్లో కోడి పందేలు, విష సంస్కృతి విషయంలో చట్టాల పని ఏమైందని ప్రశ్నించారు. అటువంటి విష సంస్కృతిని మళ్లించేందుకు వంద సంవత్సరాలు కాదు.. 200 సంవత్సరాలైనా తమ కృషి క్రీడారంగంలో కొనసాగుతుందని చెప్పారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ క్రీడాపోటీల ఆహ్వాన సంఘం అధ్యక్షులు మహ్మద్ మదని మాట్లాడుతూ ప్రతిఒక్కరూ డివైఎఫ్ఐ కార్యక్రమాలకు కలిసి రావాలని పిలుపునిచ్చారు. సభలో ఆహ్వాన సంఘం కన్వీనర్ డోకల రవితేజ, నేతలు బి.రాంబాబు తదితర ప్రముఖులు పాల్గొన్నారు. అనంతరం మూడు నియోజకవర్గాలస్థాయి వాలీబాల్ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు ఎంఎల్‌సి, ఎఎస్‌పి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.

తాతినాడ ఏ టీమ్‌కు కప్పు, నగదు బహుమతిని అందజేస్తున్న ఎంఎల్‌సి గోపీమూర్తి, అడిషనల్ ఎస్‌పి భీమారావు

ప్లాస్టిక్‌రహిత జిల్లాగా పశ్చిమను తీర్చిదిద్దాలి

కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

పచ్చని పశ్చిమగోదావరి జిల్లాను ప్లాస్టిక్‌రహిత జిల్లాగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత మనందరిపై ఉందని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. గురువారం స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో దశలవారీ ప్లాస్టిక్ నిషేధం కార్యాచరణపై డిఆర్‌డిఎ, డిపిఆర్‌ఒ, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో ఆమె సుదీర్ఘంగా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నానాటికీ ఇబ్బిడిముబ్బిడిగా పెరిగిపోతున్న ప్లాస్టిక్‌ను నియంత్రించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్లాస్టిక్ వినియోగం కారణంగా తాగునీరు, ఆహారం కలుషితమై అనేక అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నామన్నారు. ప్లాస్టిక్‌ను నిరోధించడంలో ఎవరో వస్తారనేది కాకుండా మన వంతుగా మనం ఏం చేయగలుగుతాం అని స్ఫూర్తినిచ్చే తొలి అడుగు ప్రతి ఒక్కరూ వేయాల్సిన అవసరం ఉందన్నారు. తొలి దశలో క్యారీ బ్యాగ్‌లు, టీ గ్లాసుల నిరోధానికి చర్యలు తీసుకుంటూ, అన్ని విధాలా ప్లాస్టిక్ నియంత్రణకు దశలవారీ చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నుండి అమలుకు ఆదేశిస్తున్నామన్నారు. ప్రతి ఇంటి నుండి పాల కవర్ల సేకరణకు ప్రత్యేక చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ప్లాస్టిక్ కవర్ల స్థానంలో గుడ్డ సంచులను విరివిగా అందుబాటులో ఉంచుతామన్నారు. ముఖ్య ప్రాంతాల్లో గుడ్డ సంచులు, గాజు గ్లాసుల అమ్మకాలకు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ప్లాస్టిక్ నియంత్రణకు పెద్దఎత్తున అవగాహనా సదస్సులు, ర్యాలీల నిర్వహణకు అధికారులను ఆదేశించారు. సమావేశంలో డిఆర్‌డిఎ పీడీ ఎంఎస్ఎస్.వేణుగోపాల్, డిపిఆర్‌ఒ టి.నాగేశ్వరరావు, శ్రీ విజ్ఞాన వేదిక కన్వీనర్ చెరుకువాడ రంగసాయి, కంతేటి వెంకటరాజు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లు

రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

కూటమి ప్రభుత్వ హయాంలో అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు అని, పల్లెసీమల రూపురేఖలను మార్చి ప్రజల్లో ఆనందాన్ని చూడాలన్నదే ప్రభుత్వ ఆశయం అని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. గురువారం మండలంలోని వెలివెల, చింతపర్రు, వడ్లవానిపాలెం గ్రామాల్లో రూ.3.30 కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు ఆయన శ్రీకారం చుట్టారు. మంత్రి స్వయంగా మోటరు సైకిల్ నడుపుతూ ప్రజలకు అభివాదం చేస్తూ ఆయా గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో గ్రామాల్లో పర్యటించినప్పుడు తాగునీరు సరిగా వచ్చేది కాదని, వచ్చిన నీరు కళ్లాపు, మొక్కలకు వినియోగిస్తున్నామని మహిళలు చెప్పేవారని గుర్తు చేశారు. తాము ప్రతి గ్రామంలో 60 శాతం నిధులు తాగునీటి కోసం వెచ్చిస్తున్నామన్నారు. ప్రతి ఇంటికీ కుళాయి, పైప్‌లైన్లు, మైక్రో ఫిల్టర్ బెడ్లు నిర్మించి ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీటిని రెండు పూటలా అందిస్తామని తెలిపారు. దశలవారీగా ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చి, గుంతలు లేని రహదారుల ఆంధ్రప్రదేశ్‌ను ప్రజలకు చూపిస్తామని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్, తహశీల్దార్ వై.దుర్గాకిషోర్, ఎంపిడిఒ ఎన్ఎన్.ఉమామహేశ్వరరావు, డిఇలు కలవకొలను దుర్గారామస్వామి, బివి.రమణ, పి.శ్రీనివాసరావు, రామాయణం త్రిమూర్తులు, ఇఒపిఆర్‌డి టి.మూర్తిబాబు, ఎఇ వి.శ్యాంబాబు, ఎంపిపి చిట్టూరి కనకలక్ష్మి, జెడ్‌పిటిసి సభ్యులు నడపన గోవిందరాజులునాయుడు, గ్రామ సర్పంచులు కందుల వెంకటేశ్వరరావు, గుమ్మాపు పెద్దిరాజు, పెన్మెత్స పద్మ, నాయకులు కోడి విజయభాస్కర్, మామిడిశెట్టి పెద్దిరాజు, పెన్మెత్స రామబద్రిరాజు, పాముల రజనీకుమార్, మహ్మద్ జానీ, చినమిల్లి గణపతిరావు, అందేకోట వీరభద్రం, కూటమి నాయకులు పాల్గొన్నారు.

శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి నిమ్మల రామానాయుడు

పిఎం ఇంటర్న్‌షిప్‌ను వినియోగించుకోవాలి

కలెక్టర్ చదలవాడ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

రానున్న ఐదేళ్లలో సుమారు కోటి మందికిపైగా యువతకు 'పిఎం ఇంటర్న్‌షిప్' పేరిట అవకాశం కలగనుందని, దీన్ని అంతా వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. యువతలో నైపుణ్యాభివృద్ధిని పెంపొందించేందుకు ఈ కార్యక్రమం చేపట్టామని, టాప్-500 కంపెనీల్లో ఈ పథకం ద్వారా యువతకు అవకాశాలు కలగనున్నాయని తెలిపారు. ఈ నెల 14 నుంచి దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైందని, 21వ తేదీ వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని చెప్పారు. టాప్-500 కంపెనీల్లో ఇంటర్న్‌షిప్‌కు అవకాశం కల్పిస్తారని, దీనికి ఎంపికైన వారికి నెలకు రూ.5 వేలు చొప్పున ఏడాదికి రూ.60 వేల ఉపకార వేతనం లభిస్తుందని, అంతేకాకుండా ఏదైనా కంపెనీలో చేరే ముందు అందజేసే రూ.6 వేలు (వన్ టైం గ్రాంట్) కూడా యువతకు అందుతుందని తెలిపారు. పిఎం ఇంటర్న్‌షిప్‌లో చేరే వారికి వ్యక్తిగత బీమా కూడా ఉంటుందని చెప్పారు. ఈ పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు https://pminternship.mca.gov.in/login అనే వెబ్‌సైట్‌లో లాగిన్తై రిజిస్టర్ కావాలన్నారు. 21-24 మధ్య వయస్సున్న యువత అర్హులన్నారు.

రోడ్డు ప్రమాదాలు జీరో శాతానికి తగ్గించేందుకు కృషి

రహదారి భద్రత మహోత్సవాల ప్రారంభంలో కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

రోడ్డు ప్రమాదాలను జీరో శాతానికి తగ్గించేందుకు అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలను కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఆమె గురువారం ప్రారంభించారు. దీనికి సంబంధించిన జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలు-2025 వాల్‌పోస్టర్, కరపత్రాలు, బ్యానర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాగరాణి మాట్లాడుతూ ప్రమాదాల వల్ల ఒక ప్రాణాన్ని పోగొట్టుకున్నా తిరిగిరాని పరిస్థితి ఉందని, ఇతరుల పొరపాటు వల్ల ప్రాణాలు కోల్పోవచ్చని, ఎలా భద్రతగా ఉండవచ్చు అనేదానిపై అందరికీ విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. అజాగ్రత్తగా వాహనాలను నడపడం వల్లే 90 శాతం ప్రమాదాలు జరుగుతున్నాయని, నిబంధనలను పాటించడం ద్వారా వీటిని నివారించవచ్చునని సూచించారు. రహదారి భద్రతా నియమాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివిధ తరగతుల ప్రజలకు, వాహన డ్రైవర్లకు విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో ఈ నెల 16 నుంచి ఫిబ్రవరి 15వ తేదీ వరకు నిర్వహించే జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా వివిధ కార్యక్రమాలను చేపట్టాలన్నారు. ఈ నెల 17న రహదారి భద్రతపై అవగాహన కల్పించేందుకు స్వచ్ఛంద సంస్థలు, డ్రైవింగ్ స్కూల్ ఇన్‌స్ట్రక్టర్స్, రిటైర్డ్ ఆర్‌టిసి సిబ్బందితో వాలంటీర్లను గుర్తించి వారికి శిక్షణ ఇవ్వాలన్నారు. ఈ నెల 18న డ్రైవర్లందరికీ ఆరోగ్య పరీక్షలు, కంటి పరీక్షలు చేయించాలని, ఈ కార్యక్రమంలో లారీ ఓనర్స్, డ్రైవర్స్ అసోసియేషన్లను భాగస్వాములను చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా రవాణాధికారి టి.ఉమామహేశ్వరరావు, ఎంవిఐ కెఎస్ఎన్.ప్రసాద్, ఆర్‌టిసి భీమవరం డిపో మేనేజర్ పిఎన్‌వి‌ఎం.సత్యనారాయణమూర్తి, ఎఎంవిఐలు ఎం.రవికుమార్, సత్యనారాయణ, ఫణితేజ, ఆర్‌అండ్‌బి డిఇలు కుమార్, ప్రసాద్, ట్రాఫిక్ ఎస్ఐ గగారియా పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ నాగరాణి

గిట్టుబాటు ధర కల్పించాలని నిరసన

ప్రజాశక్తి - తణుకు

రైతులకు గిట్టుబాటు ధర లేక నష్టపోతున్నారని, రైతులకు రూ.500 బోనస్ ప్రకటించాలని సిపిఎం మండల కన్వీనర్ కామన మునిస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం రైతులకు బోనస్ ప్రకటించాలని కొత్తపాడులో సిపిఎం, కౌలురైతుల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మునిస్వామి మాట్లాడుతూ రైతులకు గిట్టుబాటు ధర లేక నష్టపోతున్నారని, చాలామంది ఈ మధ్యకాలంలో ఆత్మహత్యలు కూడా చేసుకున్నారని అన్నారు. పక్క రాష్ట్రమైన కేరళలో కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు అదనంగా రూ.800, తెలంగాణలో రూ.500లు బోనస్‌గా రైతులకు చెల్లిస్తున్నారని మునిస్వామి గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు అన్నదాత సుఖీభవ పేరుతో ప్రతి రైతుకూ రూ.20 వేలు ఇస్తామని వాగ్దానం చేసి అధికారంలోకి వచ్చి ఏడు నెలలు దాటినా ఒక్క రూపాయి కూడా ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. రైతుల సమస్యలపై కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదని విమర్శించారు. తక్షణం కనీస మద్దతు ధరల చట్టం తీసుకురావాలని, రైతులను ఆదుకోవాలని కోరారు. లేనిపక్షంలో సిపిఎం ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఉద్యమిస్తామని మునిస్వామి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నేతలు బొంతు నాగబాబు, పిల్లి కోటేశ్వరరావు, తాళం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఆందోళన చేస్తున్న సిపిఎం నేతలు

ప్రతి నియోజకవర్గంలోనూ.. ఇండస్ట్రియల్ పార్కులు..!

జిల్లాలో 1500 ఎకరాల ప్రభుత్వ భూమి గుర్తింపు

కొల్లేరులో 14 వేల ఎకరాల జిరాయితీ భూములు, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

జనవరి నెలాఖరుకు రోడ్లపై గుంతలు పూడ్చుతాం

పోలవరం నిర్వాసితుల సమస్యలపై ప్రత్యేక గ్రామసభలు

ఏలూరు సర్వజన ఆసుపత్రి సమస్యలపై ప్రత్యేక కార్యాచరణ

డిఆర్‌సి సమావేశంలో ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్

డిఆర్‌సి సమావేశంలో మాట్లాడుతున్న ఏలూరు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

జిల్లాలో వ్యవసాయంతోపాటు పారిశ్రామిక అభివృద్ధికి ప్రతి నియోజకవర్గంలోనూ ఇండస్ట్రియల్ పార్కులు ఏర్పాటు చేసేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నామని, మార్చి 15కల్లా ఇండస్ట్రియల్ పార్కుల ఏర్పాటుకు సంబంధించి పనులు చేపడతామని, దీనికి నోడల్ వ్యవస్థను ఏర్పాటు చేస్తామని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో మనోహర్ అధ్యక్షతన డిఆర్‌సి (జిల్లా సమీక్షా కమిటీ) సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సమాచారశాఖ మంత్రి కొలుసు పార్థసారధి, ఎంపీ పుట్టా మహేష్‌కుమార్, జెడ్‌పి ఛైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ, పలువురు ఎంఎల్‌ఎలు, జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి, జెసి ధాత్రిరెడ్డి, ఎస్‌పి కె.ప్రతాప్‌శివకిషోర్, జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఉదయం 11.30 గంటలకు ప్రారంభమైన సమావేశం మధ్యాహ్నం 2.30 గంటల వరకూ సాగింది. జిల్లాలోని ప్రధానమైన అంశాలపై చర్చ సాగింది. సమావేశం అనంతరం వివరాలను ఇన్‌ఛార్జి మంత్రి మనోహర్ మీడియాకు వివరించారు. తొలుత పోలవరం ఆర్‌అండ్‌ఆర్ అమలు, కాలనీల్లో సమస్యలపై చర్చించారు. పోలవరం, కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో 41.15 పరిధిలో ఎన్ని గ్రామాలు ఖాళీ చేయిస్తున్నారు, ఎన్ని నిర్వాసిత కుటుంబాలకు పరిహారం జమైంది, నిర్వాసిత కాలనీల్లో ఇళ్ల నిర్మాణం, మౌలిక సదుపాయాలపై చర్చించారు. ఈ సందర్భంగా పోలవరం ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజు మాట్లాడుతూ స్ట్రక్చర్ వాల్యూపై సమస్యలు ఉన్నాయన్నారు. గ్రామసభలు నిర్వహించి నిర్వాసితుల సమస్యలను తెలుసుకుంటే బాగుంటుందన్నారు. 2017 తర్వాత 18 ఏళ్లు నిండిన యువతకు పరిహారం అందలేదన్నారు. ఇళ్ల నిర్మాణంలో సమస్యలు ఉన్నాయని, కాలనీల్లో మౌలిక సదుపాయాలు సరిగా లేవని అన్నారు. దీనిపై ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ అంతా కలిసి ఒకసారి మండలస్థాయిలో గ్రామసభలు నిర్వహిద్దామని, అందుకు సంబంధించిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను ఆదేశించారు. జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధిపై జరిగిన చర్చలో మంత్రి కొలుసు పార్థసారధి, ఎంపీ పుట్టా మహేష్‌కుమార్, ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్ మాట్లాడారు. వట్లూరులోని పెద చెరువుకు సంబంధించిన 350 ఎకరాల భూములపై చర్చ సాగింది. దీనిపై పూర్తి నివేదిక ఇవ్వాలని ఇన్‌ఛార్జి మంత్రి అధికారులను ఆదేశించారు. ప్రతి నియోజకవర్గంలో ఇండస్ట్రియల్ పార్కులు ఏర్పాటు చేసేలా ప్రణాళికతో ముందుకు సాగాలన్నారు. ల్యాండ్ బ్యాంక్‌లో భాగంగా 1500 ఎకరాల ప్రభుత్వ భూమి గుర్తించడంతో తొలి అడుగు పడిందన్నారు. ప్రభుత్వ భూమి పక్కాగా ల్యాండ్ పూలింగ్ ద్వారా సేకరిస్తే పరిశ్రమలు ఏర్పాటు చేయవచ్చునని ఇన్‌ఛార్జి మంత్రి దృష్టికి చింతమనేని ప్రభాకర్ తీసుకెళ్లారు.

కొల్లేరులో 14,250 ఎకరాల జిరాయితీ భూముల పరిస్థితి ఏమిటి?

కొల్లేరుపై చర్చలో ఎంఎల్‌ఎలు కామినేని శ్రీనివాస్, చింతమనేని ప్రభాకర్, పత్సమట్ల ధర్మరాజు, ఎంఎల్‌సి జయమంగళ వెంకటరమణ అక్కడి సమస్యలపై మాట్లాడారు. ఐదో కాంటూరు పరిధిలో 77 వేల ఎకరాల ఉండాల్సి ఉండగా అటవీశాఖ అధికారులు దాదాపు 90 వేల ఎకరాల్లో చెరువులను అప్పట్లో ధ్వంసం చేశారన్నారు. వీటిలో 14,250 ఎకరాలు జిరాయితీ భూములు, 5,600 ఎకరాలు డి ఫారం పట్టా భూములు ఉన్నాయన్నారు. సుప్రీంకోర్టు, పలు కమిటీలు చెప్పినప్పటికీ ఇప్పటికీ రైతుల జిరాయితీ భూములను అప్పగించలేదన్నారు. జిరాయితీ భూములను అప్పగించడంతోపాటు ప్రస్తుతం జరుగుతున్న చెరువుల ధ్వంసం చర్యలను ఆపాలని కోరారు. అక్కడి గ్రామాలకు రోడ్లు వేయకుండా ఫారెస్ట్ అధికారులు అడ్డుపడటంపై అంతా ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్కడి ప్రజలను ఇబ్బందులు పెడుతున్న అధికారులు గత ప్రభుత్వ హయాంలో అక్రమంగా వందల ఎకరాల్లో చెరువులు తవ్వినా పట్టించుకోలేదన్నారు. అందులో సూత్ర, పాత్రధారులను తేల్చాల్సి ఉందన్నారు. దీనిపై పూర్తి నివేదిక ఇవ్వాలని అక్కడి ప్రజలకు రోడ్ల సమస్య లేకుండా చూడాలని అధికారులను ఇన్‌ఛార్జి మంత్రి మనోహర్ ఆదేశించారు. దీనిపై సిఎం, డిప్యూటీ సిఎం సమక్షంలో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడదామన్నారు. ఆర్‌అండ్‌బి రోడ్ల పనులపై అధికారులను ప్రజాప్రతినిధులు నిలదీశారు. బ్రిడ్జిలు వంటివి తప్ప మిగిలిన గుంతల పూడ్చివేత ఈ నెలాఖరుకు పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు. బుట్టాయిగూడెం మండలం పట్టిన్నపాలెంలో 50 శాతం బ్రిడ్జినిర్మాణాన్ని పెండింగ్ బిల్లులు చెల్లించి పూర్తి చేస్తామన్నారు. నారాయణపురం వద్ద వంతెనపై వెంటనే ఏదోకటి తేల్చాలని అధికారులకు సూచించారు. పంచాయతీరాజ్ పరిధిలోని రోడ్లపైనా చర్చ సాగింది. ధాన్యం కొనుగోలులో ఏలూరు జిల్లా అధికారులు బాగా పని చేశారని, పౌరసరఫరాల శాఖా మంత్రిగా మీకు అభినందనలు అంటూ ప్రజాప్రతినిధులు ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్‌పై ప్రశంసల జల్లు కురిపించారు. ఏలూరు కార్పొరేషన్ పరిధిలో తన నియోజకవర్గానికి చెందిన ప్రజలు రెండు వేల మంది ఉన్నప్పటికీ కార్పొరేషన్ సమావేశాలకు తనకు ఆహ్వానం అందడం లేదంటూ దెందులూరు ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్ తెలిపారు. దీనిపై కమిషనర్ నిబంధనలు వర్తించవంటూ మాట్లాడంపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. చింతమనేనిని సైతం పిలవాలని ఇన్‌ఛార్జి మంత్రి తెలిపారు. ఆర్‌డబ్ల్యూఎస్ పరిధిలోని జలజీవన్ మిషన్, ఇతర అంశాలపైనా చర్చ సాగింది. అధికారుల తీరును ప్రజాప్రతినిధులు, ఇన్‌ఛార్జి మంత్రి తప్పుబట్టారు. ప్రజల సమస్యలను తేలిగ్గా తీసుకోవద్దన్నారు.

ఏలూరు సర్వజన ఆసుపత్రిపై ప్రత్యేక సమావేశం ఏర్పాటుకు నిర్ణయం

డిఆర్‌సి సమావేశానికి ముందు మంత్రి మనోహర్ ఏలూరు సర్వజన ఆసుపత్రిలో ఆకస్మిక తనిఖీలు చేశారు. డిఆర్‌సి సమావేశంలో మెడికల్ సమస్యలపై ఎజెండా వచ్చినప్పుడు తనకు ఆసుపత్రిలో ఎదురైన అనుభవాలను ఇన్‌ఛార్జి మంత్రి వివరించారు. వైద్యుల కొరత నుంచి, స్కానింగ్, మెడికల్ కాలేజీ, రోగుల సమస్యలు చాలా ఉన్నాయని, దీనిపై ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసుకుని అంతా చర్చిద్దామన్నారు. ఆసుపత్రికి పూర్వ వైభవం తెస్తామన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లోని సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు.

పారిశుధ్యం మెరుగుకు ఇ-పుష్‌కాట్‌లు

ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ

ప్రజాశక్తి - తణుకు

స్వచ్ఛభారత్ లక్ష్యంగా పారిశుధ్యం మెరుగుకు ఇ-పుష్‌కాట్‌లు (పారిశుధ్య బండ్లు) ఉపయోగపడతాయని తణుకు ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో పట్టణంలోని 34 వార్డుల్లో చెత్త సేకరించడానికి పారిశుధ్య బండ్లను ఆయన ప్రారంభించారు. అనంతరం పారిశుధ్య కార్మికులకు నూతన వస్త్రాలను అందజేశారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ పట్టణంలోని 34 వార్డుల్లో ప్రతి ఇంటి వద్ద నుంచి చెత్తను సేకరించేందుకు మున్సిపాల్టీ ద్వారా సుమారు రూ.10 లక్షల వ్యయంతో సుమారు 35 పుష్‌కాట్స్‌ని అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. ఇళ్ల వద్దకు వెళ్లి చెత్తను సేకరించి నిర్థిష్టమైన ఒక ప్రాంతంలో ఉంచి అక్కడ నుండి డంపింగ్ యార్డుకు తరలిస్తారన్నారు. ప్రతి సంవత్సరం చెత్త సేకరణకు ఆటోల ద్వారా రూ.కోటీ 70 లక్షలు ఖర్చు పెడుతున్నారని, దానిలో సగం ఖర్చుతో ఇ-పుష్‌కాట్స్‌తో పారిశుధ్యాన్ని మెరుగుపరుస్తామని తెలిపారు. అదనంగా మరో 14 మంది పారిశుధ్య కార్మికులను తీసుకున్నామన్నారు. మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు ఆయన దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ టి.రామ్‌కుమార్, టిడిపి పట్టణాధ్యక్షులు కలగర వెంకటకృష్ణ, మంత్రిరావు వెంకటరత్నం, నల్ల భాస్కరరావు, ఒమ్మి రాంబాబు, తాతపూడి మారుతీరావు, జనసేన నాయకులు కొమ్మిరెడ్డి శ్రీనివాసు, బిజెపి నాయకులు బొల్లాడ దానేశ్వరి, టిఎన్‌టియుసి నాయకులు గండి రామకృష్ణ, తామరాపు సత్యనారాయణ, రమణమ్మ, నత్తా శేఖర్, పచ్చిపాల మృత్యుంజయరావు తదితరులు పాల్గొన్నారు.

చెత్త బళ్లు ప్రారంభిస్తున్న శాసనసభ్యులు ఆరిమిల్లి రాధాకృష్ణ

ఫిర్యాదుల పరిశీలన

ప్రజాశక్తి - ఉండి

ఇటీవల నిర్వహించిన రెవెన్యూ సదస్సులో వచ్చిన ఫిర్యాదులను డిప్యూటీ కలెక్టర్, నోడల్ అధికారి నారాయణరెడ్డి, తహశీల్దార్ కార్యాలయంలో గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరి భూ సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో 150 అర్జీలు వచ్చాయని, వాటిని పరిశీలించామని తెలిపారు. వాటన్నింటినీ పరిష్కరించి వారికి న్యాయం చేస్తామన్నారు.

డిప్యూటీ స్పీకర్‌ను కలిసిన మంత్రి శ్రీనివాస్

కాళ్ల: శాసనసభ డిప్యూటీ స్పీకర్, ఎంఎల్‌ఎ రఘు రామకృష్ణంరాజును చిన్న మధ్య తరహా పరిశ్రమల శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కలిశారు. పెదఅమిరం గ్రామంలో సంక్రాంతి పండుగ సందర్భంగా రఘురామకృష్ణ రాజు నివాసంలో గురువారం కలిసి పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అనుచరులు, నియోజకవర్గ సభ్యులు జిల్లా నాయకులు తదితరులు ఉన్నారు.

31 మందికి వైద్య పరీక్షలు

తణుకు: సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో గురువారం సాయిశ్వేత డయోగ్నస్టిక్ లాబ్ వారిచే అతి తక్కువ ధరకు సుమారు 31 మందికి రక్త పరీక్షలు నిర్వహించి, రిపోర్టులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు కరుణాకర చౌదరి, సభ్యులు పెనుమర్తి సత్యనారాయణ పాల్గొన్నారు.


క్రికెటర్ నిరంజన్ రెడ్డిని, ప్రశాంత్‌ను సత్కరిస్తున్న ఆలయ అధికారులు

మావుళ్లమ్మ సన్నిధిలో క్రికెటర్ నిరంజన్ రెడ్డి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ప్రముఖ క్రికెటర్ నిరంజన్ రెడ్డి గురువారం స్థానిక శాసనసభ్యులు పులపర్తి రామాంజనేయులు తనయుడు పులపర్తి ప్రశాంతితో కలిసి పట్టణంలోని మావుళ్లమ్మను దర్శించుకున్నారు. వారికి ఆలయ సహాయ కమిషనర్, ఇఒ బుద్ధ మహాలక్ష్మి నగేష్ ఆధ్వర్యంలో ఆలయ మర్యాదలతో ఘనంగా సత్కరించారు. అమ్మవారి ప్రతిమను అందించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎవిజి మల్టీప్లెక్స్ మేనేజర్ మధు, అయ్యప్పస్వామి, సిఐ నాగరాజు, ఆలయ అర్చకులు అధికారులు పాల్గొన్నారు.

బసవన్న కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న పుష్పరాజు

నాగ బసవన్న మృతి తీరని లోటు

మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షులు నన్నేటి పుష్పరాజ్

ప్రజాశక్తి - ఆచంట

ఆచంట వేమవరానికి చెందిన వైసిపి కర్ణ భక్తుల రాష్ట్ర మాజీ డైరెక్టర్ అందే నాగ బసవన్న మృతి తీరని లోటని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు నన్నేటి పుష్పరాజ్ అన్నారు. ఈ సందర్భంగా ఆచంట వేమవరంలో గురువారం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా పుష్పరాజ్ మాట్లాడుతూ బసవన్న పార్టీలకతీతంగా అందరితో కలివిడిగా ఉండేవారని, అలాంటి వ్యక్తి మన మధ్య లేకపోవడం బాధాకరమని తెలిపారు. ఆయన కుటుంబానికి అండగా ఉంటామని పుష్పరాజ్ తెలిపారు. కార్యక్రమంలో తాతయ్య, మహేష్, సుబ్రహ్మణ్యం, తమ్ముడు శివరామకృష్ణ, సాయి పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్లు అందజేస్తున్న రామరాజు, నాగరాజు

పేదలకు దుప్పట్లు, దుస్తులు అందజేత

ప్రజాశక్తి - మొగల్తూరు

ప్రతి ఒక్కరూ తోటి వారికి తమ వంతు సహాయ సహకారాలు అందించాలని టిడిపి నర్సాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు అన్నారు. ముత్యాలపల్లిలో పార్టీ మండల అధ్యక్షుడు గొబ్బల నాగరాజు అధ్యక్షతన ఆరోగ్య వర్షిణి ట్రస్ట్ ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని గురువారం పేదలకు దుప్పట్లు, దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రామరాజు మాట్లాడారు. మానవసేవే మాధవ సేవ అన్నారు. అనంతరం పేదలకు దుప్పట్లు, దుస్తులు అందించారు. కార్యక్రమాల్లో ట్రస్ట్ ఛైర్మన్ నాగిడి రాంబాబు, బంధన నరసింహస్వామి, కొల్లాటి మూలస్వామి, పెంటయ్య, బందన విజయకుమార్, దొంగ శ్రీను, కట్ట మురళి, కుక్కల వాసు, కొల్లాటి తులసి రామారావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ

సాగునీరు అందించేందుకు కృషి

ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ

ప్రజాశక్తి - పెనుమంట్ర

గత ఐదేళ్లలో ఇరిగేషన్ వ్యవస్థను జగన్ ప్రభుత్వం పూర్తిగా భ్రష్టు పట్టించిందని, దాన్ని నీటి సంఘాల ద్వారా ఇరిగేషన్ వ్యవస్థలో జవ సత్వాలను నింపాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మాజీ మంత్రి, ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ అన్నారు. గురువారం మండలంలోని మార్టేరు శ్రీవేణుగోపాలస్వామి ఆడిటోరియంలో నీటి సంఘాలు వాటర్ డిస్ట్రిబ్యూటర్ సంఘాల అభినందన సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సత్యనారాయణ మాట్లాడుతూ ఇరిగేషన్ అధికారులు, నీటి సంఘాల ప్రతినిధులు సమన్వయంతో శివారు భూములకు ప్రణాళికాబద్ధంగా సాగునీరందించాలని కోరారు. రైతాంగ సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. డ్రెయినేజీ, కాలువల పూడికతీత పనులు, అవుట్లెట్ ఇన్‌లెట్, పనులు అవసరాలను బట్టి సిద్ధం చేయాలని ఆదేశించారు. కూటమి ప్రభుత్వం రైతు పక్షపాతి ప్రభుత్వమని మరోసారి నిరూపించుకుందన్నారు. సార్వాలో ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లో డబ్బు జమ చేసిన ప్రభుత్వం ఏదైనా ఉంటే అది కూటమి ప్రభుత్వం ఒక్కటేనని అన్నారు. నూతనంగా ఎంపికైన పెనుమంట్ర వాటర్ డిస్ట్రిబ్యూటరీ సంఘం, సిద్ధాంతం వాటర్ డిస్ట్రిబ్యూటర్ సంఘం, కవిటం వాటర్ డిస్ట్రిబ్యూటర్ సంఘం పరిధిలోని నీటి సంఘాల అధ్యక్షులు ఉపాధ్యక్షులు డైరెక్టర్లను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో మార్టేరు క్లస్టర్ ఇన్‌ఛార్జి కర్రి అచ్యుతరామరెడ్డి, మండల అధ్యక్షులు కేత మీరయ్య, పెనుగొండ మండల అధ్యక్షులు వెలిచేటి బాబు రాజేంద్రప్రసాద్, మార్టేరు డిస్ట్రిబ్యూషన్ కమిటీ అధ్యక్షులు జక్కంశెట్టి సత్యనారాయణ, పెనుమంట్ర డిస్ట్రిబ్యూషన్ కమిటీ అధ్యక్షులు వెలగల బుల్లి రామిరెడ్డి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - మొగల్తూరు

మొగల్తూరులోని విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో పలు గ్రామాల్లో శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నామని ఆ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.మధుకుమార్ తెలిపారు. మొగల్తూరు, రామన్నపాలెం, జెట్టిపాలెం గ్రామాల్లో విద్యుత్ సరఫరా వైర్లకు ఆటంకంగా ఉన్న చెట్టు కొమ్మలు తొలగించి మరమ్మతులు చేయనున్నామని ఆయన తెలిపారు. విద్యుత్ అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని ఆయన సూచించారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

అడుగుపర్రలో చెరువును తలపిస్తున్న వరిపొలం

కొత్తకాయలతిప్ప సమీపంలో చేలల్లో పెరిగిన బీళ్లు

కాలువల ప్రక్షాళన ఏదీ..!

ఏటా ముంపు బారిన వరిచేలు

పొలాల్లోకి చేరుతున్న ఉప్పునీరు

పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని మురుగు, సాగునీటి కాలువలు గత కొన్నేళ్లుగా ప్రక్షాళనకు నోచుకోలేదు. దీంతో ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తే ఈ ప్రాంతంలోని చేలు ముంపుబారిన పడుతున్నాయి. వర్షాభావ పరిస్థితుల్లో సాగునీరందక చేలు ఎండిపోతున్నాయి. దీంతో దాళ్వా, సార్వాలోనూ అన్నదాతలు తీవ్ర నష్టాల పాలవుతున్నారు. సాగు భారమై అన్నదాతలు స్వచ్ఛందంగా సాగు విరామం తీసుకుంటున్నారు.

దర్భరేవు ఆయకట్టుపరిధిలో..

నియోజకవర్గం దర్భరేవు డ్రెయిను ఆయకట్టులోని భూముల్లో దాళ్వాసాగు ప్రశ్నార్థకంగా మారింది. ఈ డ్రెయిను నరసాపురం గ్రామీణ మండలం దర్భరేవు గోదావరి నుంచి కొండవీటికొడప, ఎల్‌బిచర్ల, పసలదీవి, రామన్నపాలెం, కొత్తకాయలతిప్ప, మోడీ గ్రామాల పరిధిలో సుమారు 16 కిలోమీటర్ల మేర ప్రవహిస్తూ ముత్యాలపల్లి వద్ద ఉప్పుటేరులో కలుస్తుంది.

శిథిలకల్వర్టులతో..

ఈ డ్రెయిన్‌పై ఆరు ప్రాంతాల్లో గతంలో పైపు కల్వర్టులు నిర్మించారు. ఆ పైపు కల్వర్టులు శిథిలమయ్యాయి. దీంతో దర్భరేవు డ్రెయిన్‌లో నీటి ప్రవాహానికి ఆటంకంగా మారాయి. కొత్తకాయలతిప్ప వద్ద ఉన్న పైపు కల్వర్టు పూర్తిగా ధ్వంసమైంది. ఈ ప్రాంతంలో ఓ పైపు కల్వర్టు తొలిగించి వంతెన నిర్మించాలని కోరుతూ అన్నదాతలు అధికారులకు, ప్రజాప్రతినిధులకు గత కొన్నేళ్ళుగా వినతులు అందిస్తూనే ఉన్నారు. వంతెన నిర్మాణ దిశగా చర్యలు చేపట్టలేదు. ఆ డ్రెయినులో కిక్కిస, తూడు, గుర్రపుడెక్క పెరిగి సమస్య మరింత జఠిలంగా మారింది.

చెరువుల్లా చేలు..

దర్భరేవు ఆయకట్టు పరిధిలోని గ్రామాల్లో సుమారు 2,500లకుపైబడి ఎకరాలు వరిసాగు భూములు ఉన్నాయి. వాటిల్లో ముంపు నీరు బయటకు వెళ్లేమార్గం లేదు. ఆయా చేలల్లో నేటికీ మూడు అడుగుల లోతు నీరు నిలిచి ఉంది. అక్కడ నారుమడులు వేసేందుకు అవకాశం లేదు. సార్వాలో సాగు విరామం పాటించారు. దాళ్వాలోనూ అదే పరిస్థితి నెలకొంది. నాలుగేళ్లుగా పలువురు రైతులు స్వచ్ఛంద సాగు విరామం పాటిస్తున్నారు. కొత్తకాయలతిప్ప ప్రాంతంలో పలువురు రైతులు దాళ్వాసాగుకు చేలను సిద్ధం చేస్తున్నారు. చేలల్లో తూడు, నాచు, బీళ్లను తొలగించేందుకు ఎకరాకు రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకూ ఖర్చవుతుందని అన్నదాతలు వాపోతున్నారు. దర్భరేవు డ్రెయిను ప్రక్షాళనకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

పలుచోట్ల సంక్రాంతి ఆటల పోటీలు

నరసాపురంలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎస్ఐ

ఆకివీడులో జరుగుతున్న చెడుగుడు పోటీలు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

డివైఎఫ్ఐ, వ్యవసాయ కార్మిక సంఘం, అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఆధ్వర్యంలో గురువారం మండలంలోని నవాబ్‌పాలెం గ్రామంలో సంక్రాంతి ఆటల పోటీలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కండెల్లి సోమరాజు, రైతు సంఘం నాయకులు పాల్సూరి సత్యనారాయణ, మహిళా సంఘం నాయకురాలు బంకురు యశోద, పాల్సూరి సత్యవతి మాట్లాడుతూ సంక్రాంతి తెలుగు వారి పండుగని, వ్యవసాయ పండుగని తెలిపారు. ఈ పండుగల పేరుతో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఈ విధమైన ఆటలు పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఒక పక్క విష సంస్కృతి ప్రబలుతోందని, కోట్లాది రూపాయలు కోడిపందేల పేరుతో పోగొట్టుకుని సుఖసంతోషాలతో గడపాల్సిన జీవితాన్ని దు:ఖంతో గడుపుతున్న కుటుంబాలు కూడా ఉన్నాయని తెలిపారు. అలాంటి కోడిపందేలకు దూరంగా ఉంచడం కోసం ఈ ఆటలు పోటీలు దోహదపడుతున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా ముగ్గుల పోటీల్లో మొదటి బహుమతి ఎన్.గాయత్రి, రెండో బహుమతి వి.రామలక్ష్మి, మూడో బహుమతి బి.ఉమా శాంతి సాధించారని తెలిపారు. కుర్చీలాటలో ఎన్. గంగాభవాని టి.విశాలాక్షి ప్రథమ ద్వితీయ బహుమతులు గెలిచారన్నారు. జూనియర్స్‌లో ఉమా శాంతకుమారి, జి.దీక్షిత, బాలురలో కొల్లి వినోద్, విజయప్రసన్నకుమార్, పరుగు పందెంలో వినోద్, నిఖిల్, బాలికల్లో వల్లి ఉమా, లెమన్ స్పూన్ ఆటలో ఉమాశాంతికుమారి, వర్షిత గెలుపొందారు. విజేతలకు సర్పంచి మద్దుకూరి గంగాభవాని, టిడిపి నేతలు మాజీ ఉపసర్పంచి మద్దుకూరి ధనరాజు, బత్తుల రాంబాబు మెడికల్స్, జనసేన నాయకులు బండి శ్రీనివాస్, పంగిడి రాంబాబు చేతులు మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు కండెల్లి రమేష్, ఆర్.అనూష, బంకురు సత్యనారాయణ పాల్గొన్నారు.

నరసాపురం : సంక్రాంతి యువజనోత్సవాల పేరుతో మహిళలకు ముగ్గులు, పిల్లలకు ఆటల పోటీలు నిర్వహిస్తూ ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, సిఐటియు, ప్రజా సంఘాలు చేస్తున్న కృషి అభినందనీయమని ఎస్ఐ ముత్యాలరావు కొనియాడారు. స్థానిక 29వ వార్డు రైల్వేస్టేషన్ రోడ్డులో డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, సిఐటియు సంఘాల ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు, పిల్లలకు మ్యూజికల్ ఛైర్స్, లెమన్ స్పూన్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలకు బహుమతులను ఎస్ఐ ముత్యాలరావు చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండుగ సందర్భంగా యువతీ యువకులు చెడు అలవాట్ల వైపు వెళ్లకుండా పట్టణ, గ్రామ, వార్డు స్థాయిలో డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, సిఐటియు సంఘాలు నిర్వహిస్తున్న సంక్రాంతి యువజన ఉత్సవాల పేరుతో ఆటలు, ముగ్గుల పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ముందుగా ఎస్ఐ ముత్యాలరావుకు చిన్నారులు పూలనందించి స్వాగతం పలికారు. కార్యక్రమంలో సిఐటియు పట్టణ అధ్యక్షులు ముచ్చర్ల త్రిమూర్తులు, యువకులు జి.వెంకట్రావు, జి.ఏడుకొండలు, అంజిబాబు, కె.ఏసురత్నం పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెంలో విజేతలకు బహుతులు అందజేస్తున్న నేతలు

ఆకివీడు : సంక్రాంతి యువజన ఉత్సవాల్లో భాగంగా జరిగే పోటీలు గురువారం నాలుగో రోజు చివరి రోజుకు చేరాయి. పోటీల్లో మొత్తం 16 టీములు పాల్గొన్నాయి. వీటిలో 6 టీములను లీగ్ విధానాల్లో ఆడించారు. ఐ.భీమవరం కుమార్ టీమ్స్, కమత వానిగూడెం, వేమవరప్పాడు, కోరుకొల్లు, ఏలూరుపాడు, కైకలూరుతో సహా ఆరు టీంలు లీగ్‌లో ప్రవేశించి నువ్వా నేనా అనే స్థాయిలో ఆడారు. ఈ పోటీలు పూర్తిగా నాకౌట్ విధానాల్లో జరిగాయి. కృష్ణ పాత పశ్చిమగోదావరి జిల్లాలో స్థాయిలో జరిగిన ఈ వాలీబాల్ పోటీల్లో 30 టీములు పాల్గొన్నాయి. కాగా వీటిలో తాటినాడ ఏ-ఆకివీడు, శృంగవరప్పాడు - తాడినాడ చందు టీంలా క్రీడాకారులు ప్రేక్షకులను ఉద్రూతలూగించారు. వీరిలో ప్రథమ స్థానం గెల్చుకోగా ఆకివీడు క్రీడాకారులు రెండో స్థానాన్ని పొందారు. కాకినాడ చందు టీం బహుమతి, శృంగవరపాడు క్రీడాకారులు నాలుగో బహుమతిని గెలుచుకున్నారు. వాలీబాల్ క్రీడా పోటీలకు గోపిశెట్టి రాంబాబు ఇన్‌ఛార్జిగా వ్యవహరించారు. ఈ వాలీబాల్ పోటీలకు రెఫరీగా ముంగర సుబ్బరాజు వ్యవహరించారు.

పేదలను ఆదుకునేలా సిఎంఆర్ఎఫ్

ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ బొలిశెట్టి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

పేదలను ఆరోగ్యపరంగా ఆదుకునేందుకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సిఎంఆర్ఎఫ్) బాగా పనిచేస్తుందని ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. గురువారం స్థానిక జనసేన క్యాంపు కార్యాలయం వద్ద తాడేపల్లిగూడెం వీకర్స్ కాలనీకి చెందిన మానేపల్లి విద్యాలత రూ.1,62,000, యాగర్లపల్లికి చెందిన వంద్రశ్రీనివాస్‌కు రూ.87,226, పెంటపాడు మండలం కస్పా పెంటపాడుకు చెందిన వీర భక్తుల నాగేశ్వరరావుకు రూ.2,01,015, వల్లూరుపల్లికి చెందిన గాయం శ్రీనివాస్‌రావుకు రూ.30,071 మొత్తం నలుగురికి రూ.4,75,312 సిఎం సహాయ నిధి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ దేశం ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నా కూటమి ప్రభుత్వం పేదలను ఆదుకుంటోందన్నారు.


బాధితులకు చెక్కులు అందజేస్తున్న విప్ శ్రీనివాస్

రామకృష్ణారావు సేవలు ఎనలేనివి

ప్రజాశక్తి - నరసాపురం

తీరప్రాంత గ్రామాల్లో విద్యుత్, రోడ్లు, వంతెనలు, విద్య, తాగునీటి సమస్యల పరిష్కారానికి మాజీ ఎంపిపి కొండేటి రామకృష్ణారావు చేసిన కృషి ఎనలేనిదని పలువురు నేతలు అన్నారు. వేములదేవి వెస్ట్ గ్రామంలో గురువారం గ్రామ యువజన సంఘం ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపిపి, మాజీ వేములదీవి పడమర సర్పంచి కొండేటి రామకృష్ణారావు (కృష్ణ), లక్ష్మి సరోజినీ దంపతులను గ్రామస్తులు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా విప్, ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ మాట్లాడుతూ కొండేటి విలువలతో కూడిన రాజకీయం చేశారన్నారు. అందుకే ఆయన చేసిన అభివృద్ధిని గుర్తించి సన్మానించడం అభినందనీయమన్నారు. కాపు కార్పొరేషన్ ఛైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు మాట్లాడుతూ తీరానికి తాగునీరు, రోడ్లు, విద్య వంటి సౌకర్యాలు వచ్చాయంటే దానికి కొండేటి కృషి ఎంతో ఉందన్నారు. టిడిపి ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు మాట్లాడుతూ మండల పరిషత్ అధ్యక్షులు, సర్పంచి ఎంపిపి వంటి పదవులు చేపట్టి నిజాయతీతో వాటికి వన్నె తెచ్చారన్నారు. మాజీ ఎంఎల్ఎ కొత్తపల్లి జానకిరామ్, జనసేన రాష్ట్ర కార్యదర్శి చాగంటి చిన్న మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా సేవ చేసిన మహనీయుడు కొండేటి అన్నారు. అనంతరం కొండేటి దంపతులను గజమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ఎం.సోని, వేములదీవి వెస్ట్ సర్పంచి ఒడుగు ఏసుబాబు, అడ్డాల శ్రీను, సిపిఎం నాయకులు కవురు పెద్దిరాజు, మైలా వసంతరావు, కొండేటి శ్రీను, ఘంటసాల బ్రహ్మాజీ, ఉంగరాల నాగేశ్వరరావు పాల్గొన్నారు.


కొండేటి దంపతులను సత్కరిస్తున్న నేతలు

మానవతకు ఫ్రీజర్ అందజేత

ప్రజాశక్తి - గణపవరం

మానవత మండల కమిటీకి ఎస్.కొండేపాడు సర్పంచి దంపతులు సీతాళం పుల్లయ్య దంపతులు రూ.85 వేల విలువ చేసే ఫ్రీజర్‌ను బహూకరించినట్లు సంస్థ అధ్యక్షులు బుద్దారపు పుల్లయ్య గురువారం తెలిపారు. ఫ్రీజర్‌ను మానవత రాష్ట్ర విస్తరణ అభివృద్ధి కన్వీనర్ సాగిరాజు జానకిరామరాజు చేతుల మీదుగా అందుకున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మానవత నాయకులు బోడ్డు శ్రీనివాస్‌రావు, కె.సుబ్బరాజు, కె.కృష్ణంరాజు, బి.నాగేశ్వరతిలక్, జి.వీరాస్వామి, చిన్నబుజ్జి, ఆంజనేయులు పాల్గొన్నారు.

ఫిబ్రవరి 17, 18 తేదీల్లో ఎస్ఆర్‌కెఆర్‌లో హ్యాకథాన్ పోటీ

భీమవరం టౌన్: ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో ఫిబ్రవరి 17, 18 తేదీల్లో జాతీయ స్థాయి ప్రజ్వలన్ 2కె 25 పేరిట హ్యాకథాన్ పోటీ నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ కెవి మురళీకృష్ణంరాజు తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ సాగి రామకృష్ణ నిశాంత్ వర్మ గురువారం కళాశాలలో జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ జగపతిరాజు, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ హెడ్ డాక్టర్ బిహెచ్‌విఎస్.రామకృష్ణంరాజు, డీన్ అకాడమిక్స్ వి.చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రజ్వలన్ 2కె 25 హ్యాకథాన్ పోటీకి విద్యార్థుల రిజిస్ట్రేషన్ల కోసం ప్రత్యేకంగా రూపొందించిన పోర్టల్ ద్వారా వివరాలను నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ఈ పోటీలో విజేతలకు రూ.50,000 విలువైన బహుమతులు అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ పోటీల్లో అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొనాలని కోరారు. సిఎస్ఇ అసోసియేట్ ప్రొఫెసర్ డి. హేమలత, కోఆర్డినేటర్‌గా వ్యవహరిస్తున్నారని తెలిపారు.

ఘనంగా గోగులమ్మ జాతర

మొగల్తూరు: రామన్నపాలెం పంచాయతీ చింతపల్లివారి తోటలో గోగులమ్మ అమ్మవారి జాతరను గురువారం ఘనంగా నిర్వహించారు. 98 సంవత్సరాలుగా అమ్మవారి జాతరను నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ముక్కనుమ రోజున అమ్మవారిని గ్రామంలో శక్తి వేషధారణలు, మేళ తాళాలతో బాణాసంచ కల్పులతో గ్రామంలో ఊరేగించారు. ఆయా కార్యక్రమాల్లో నిర్వాహకులు చింతపల్లి రవి, కడలి గోపి, పాల వాసు, రామకృష్ణ పాల్గొన్నారు.

మొగల్తూరులో అన్నదానం

ప్రజాశక్తి - మొగల్తూరు

మొగల్తూరులోని కోట రోడ్డులో ఉన్న దత్తసాయి మందిరంలో గురువారం అన్నసమారాధన చేశారు. యాత్రికులు బాబాను దర్శించుకుని కానుకలు, మొక్కుబడులు చెల్లించుకున్నారు అనంతరం గ్రామానికి చెందిన అనంతపల్లి రంగ రమేష్ కుమార్తె సింధు ఆర్థిక సహాయంతో ఏర్పాటు చేసిన అన్న సమారాధన అధిక సంఖ్యలో యాత్రికులు పాల్గొన్నారు. యాత్రికులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ నిర్వహణ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

బెల్టుషాపు నిర్వాహకునికి రూ.10 వేల జరిమానా

ప్రజాశక్తి - తణుకు

ఇరగవరం మండలం కత్తవపాడు గ్రామంలో బెల్ట్‌షాపు నిర్వహిస్తున్న మురాల చిన్నికి ఇరగవరం తహశీల్దార్, మండల ఎగ్జిక్యూటివ్ వారు రూ.10 వేలు జరిమానా విధించారని ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎస్.మణికంఠరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కత్తవపాడులో అనధికారంగా మద్యం సీసాలు విక్రయిస్తూ గతంలో పట్టుపడిన మురాల చిన్నిని తహశీల్దార్, మండల ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ వారి కోర్టులో హాజరు పర్చగా అతని నుండి సంవత్సర కాలానికి బెల్ట్ షాపు నిర్వహణ, నేరాలకు పాల్పడకుండా సత్‌ప్రవర్తనతో ఉంటానని బాండ్ తీసుకోవడం జరిగిందన్నారు. అయితే చిన్ని రాసిచ్చిన సత్‌ప్రవర్తన బాండును ఉల్లంఘిస్తూ ఈనెల రెండో తేదీన అనధికారికంగా మద్యం విక్రయిస్తూ 6 మద్యం సీసాలతో తిరిగి తణుకు ఎక్సైజ్ పోలీసులకు పట్టుబడ్డాడని తెలిపారు. దీంతో మరలా నిందితుడిని ఇరగవరం తహశీల్దార్ వద్ద హాజరు పర్చగా సత్‌ప్రవర్తన బాండును ఉల్లంఘించి అనధికారికంగా బెల్ట్ షాపు నిర్వహిస్తున్నందుకు రూ.10 వేలు జరిమానా విధించారన్నారు. 10 వేల రూపాయలను చలానా రూపంలో జరిమాన గురువారం చెల్లించాడని తెలిపారు.

రామారావు మృతి పార్టీకి తీరని లోటు

కరిమెరక నాగరాజు

ప్రజాశక్తి - ఉండి

రామారావు (ఫైల్‌ఫొటో)

టిడిపి సీనియర్ నాయకులు పెద్దింటి రామారావు (70) మృతి పార్టీకి తీరని లోటు అని టిడిపి మండల అధ్యక్షులు కరిమెరక నాగరాజు, డిసి వైస్ ఛైర్మన్ మంతెన సాయి లచ్చిరాజు అన్నారు. గురువారం ఉండి ఇసుకదొడ్డిలోని టిడిపి నేత పెద్దింటి రామారావు భౌతికకాయానికి నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ పెద్దింటి రామారావు గతంలో టిడిపి అధ్యక్షులుగా, ఉండి రూరల్ బ్యాంక్ డైరెక్టర్‌గా, పంచాయతీ వార్డు సభ్యులుగా అనేక పదవులు నిర్వహించారని గుర్తు చేశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం రాత్రి మరణించారని, ఆయన ఆత్మకు శాంతి కలగాలని ఆయన కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతి సంతాపం తెలియజేశారు. 35 సంవత్సరాలుగా రేషన్ డీలర్‌గా ఉండడంతో పెద్దింటి రామారావుకు గ్రామంలో ఎంతోమందితో సత్సంబంధాలు ఉన్నాయని దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయని తెలిపారు. రామారావు మృతదేహానికి నివాళులర్పించిన వారిలో టిడిపి గ్రామ అధ్యక్షులు కాగిత బుజ్జి, ముదునూరి కృష్ణంరాజు, గురుగుబిల్లి వెంకట సత్యనారాయణ, మజ్జి కృష్ణప్రసాద్, మాసాబత్తుల నాగరాజు, రణస్థుల మహంకాళి ఉన్నారు.

ప్రకటన

మహారాజశ్రీ తణుకు నాలుగవ అదనపు జిల్లా జడ్జ్ వారి కోర్టులో
D.O.P.No.161/2024
Between:
పిటిషనర్: బర్రె ప్రదీప్
మరియు
రెస్పాండెంట్స్ : బర్రె హరి కళ్యాణి వగైరా
2వ రెస్పాండెంట్:
పాము అఖిల్, S/o వీర వెంకట సత్యనారాయణ మూర్తి, వేల్పూరు, తణుకు రూరల్ మండలం, పశ్చిమ గోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్-534222
పై నెంబర్ పిటిషన్ నందు శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారము మీకు ఎన్నిసార్లు నోటీస్లు పంపించినను అమలు జరగని కారణముగా Substitute of Service ద్వారా నోటీస్లు అమలు నిమిత్తము ది.27.01.2025 సం.రం.తేదీనకు వాయిదా వేసినారు. ఆరోజు ఉదయం గం.10-30 ని.లకు పై కోర్టు వారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలు తెలియపర్చుకోవలెను. లేనిఎడల మీ పరోక్షమందు తీర్మానించబడునని తెలియ.జేయడమైనది.
//By order//
కొండూరి అనంతపద్మనాభం
ఇందుకూరి వెంకట నరసింహారాజు
పిటిషనర్ తరపు న్యాయవాదులు
ది.11.01.2025 తణుకు, సెల్: 99481 93227

ప్రకటన

ఏలూరు జిల్లా, ఏలూరు పోస్టల్ కాలనీ విజయ గార్డెన్, 1వ రోడ్డు, డోర్ నెం. 27-21-21-6ఎ, కాపురస్తులు చోడే దక్షిణామూర్తి గారి కుమారుడు చోడే రాజు నాకు ఇచ్చిన సంజాయిషీ ప్రకారం యావన్మంది ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా
నా క్లయింటు ఏలూరు జిల్లా, భీమడోలు అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ ఆఫీస్ నందు ఆఫీస్ సబార్డినేట్‌గా పనిచేయుచున్నారు. ది. 28-12-2024వ తేదిన సాయంత్రం 5.30 గంటలకు భీమడోలు నుండి ఏలూరుకు ఆర్.టి.సి. బస్‌లో వచ్చుచుండగా మా క్లయింటు ఆఫీస్ తాలుకు 1. Witness case file for year 2024. 2. Coramandal International Bill books. 3. Stock register. 4. Analasis report`s. 5. Mediator report`s 6. Courierbills and along with and other documents
ఏలూరు బస్ స్టాండ్‌లో దిగిన వెంటనే చూచుకొనగా కనిపించకుండా పోయినవి. సదరు దస్త్రములు గురించి ఎంత వెతికిన దొరకలేదు.
కావున సదరు దస్త్రములు ఎవరికైనా దొరికిన యెడల నాకు గాని, నా క్లయింట్ అడ్రస్‌కు గాని అప్పగించవలసిందిగా కోరుచున్నాము. మరియు సదరు దస్త్రములు ఉపయోగించి ఎవరైన అన్యాకాంత్రము చేసిన ఎడల వారిపై నా క్లయింట్ తీసుకొను అన్ని సివిల్ & క్రిమినల్ చర్యలకు బాధ్యులగుదురు అని తెలియపర్చడమైనది.
సి.వి. శ్రీనివాస శాస్త్రి
సి.వి. సూర్య కృష్ణ
అడ్వకేట్స్
తంగెళ్లమూడి, ఖండ్రికగూడెం, ఏలూరు,
సెల్: 9848273389